సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 29 । జనవరి । 2023





**చారిత్రక మార్కెట్ యార్డు**

నిజామాబాద్ నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో మార్కెట్ యార్డు ఏర్పాటు చేసి నేటికి 85 ఏళ్లు గడుస్తోంది.

- 10లో ▸



**ఆధ్యాత్మిక జీవనంతో ఆనందం**

ఆధ్యాత్మిక భావాలు కలిగిన వారు ఆనందంగా ఉంటారని జగద్గురువు రాజేశ్వరానంద స్వామి పేర్కొన్నారు.

- 10లో ▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం
32.2 /17.3

పొగ మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### మార్చి 31వరకు ఓటీఎస్ పొడిగింపు

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): వన్ టైం సెటిల్‌మెంట్ స్కీం(ఓటీఎస్) మార్చి 31 వరకు పొడిగించినట్లు నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి తెలిపారు. శనివారం డీసీసీబీ బ్యాంకులో రుణాల రికవరీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్యాంకు సిబ్బంది సొసైటీ చైర్మన్లతో అనుసంధానం చేసుకుని పాత బకాయిలు వసూలు చేయాలని సూచించారు. సిబ్బంది పే రివిజన్ ఏరియర్స్ 50శాతం ఇవ్వడానికి పాలకవర్గం నిర్ణయించిందని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, బ్యాంకు సీఈవో, తదితరులున్నారు.

### వాయిదాల్లో 'ఏసీడీ' తీసుకోవాలి!

నిజామాబాద్ నాగారం : విద్యుత్ నియంత్రణ మండలి రెగ్యులేషన్ (6) 2004 ప్రకారం ముందే ఏసీడీ విద్యుత్ బిల్లు తీసుకున్నట్లయితే ఇంతగా భారం ఉండక పోయేదని టీఎస్ఎన్‌పీడీసీఎల్ రిటైర్డు సీజీఎం ఎండీ యూనిస్‌ఖాన్ శనివారం ప్రకటనలో స్పష్టం చేశారు. ఒకేసారి ఏసీడీ కట్టాలని వినియోగదారులపై ఒత్తిడి పెట్టవద్దన్నారు. ఏసీడీకి వడ్డీ లేకుండా నాలుగు నెలల పాటు వాయిదాల పద్ధతిలో విద్యుత్ వినియోగదారుడి వద్ద బకాలు తీసుకోవాలన్నారు. అంతేగాని కంపెనీ యాజమాన్యం చేసిన తప్పులకు వినియోగదారులను ఇబ్బందులు పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. ఏసీడీ నోటీసు ద్వారా సమాచారం ఇచ్చి వినియోగదారుడి దగ్గర వసూలు చేయాలన్నారు.

### ఉపాధ్యాయుల పైరవీ బదిలీలు ఆపాలి

- యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



సుభాష్‌నగర్: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఉపాధ్యాయుల పైరవీ బదిలీలు ఆపాలని, జీరో సర్వీస్ బదిలీలకు అనుమతులు ఇవ్వాలని, ఎస్జీటీ, ఎల్పీ స్పౌజ్ బదిలీలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ( యూఎస్‌పీసీ) ప్రతినిధులు డిమాండ్‌చేశారు.ఈమేరకు శనివారం కలెక్టరేట్ వద్ద యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియను అపహాస్యం చేస్తూ, రాజకీయ పలుకుబడితో చేస్తున్న వందలాది పైరవీ బదిలీలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బదిలీల్లో కనీస సర్వీస్ నిబంధనను తొలగించాలని, మిగిలిన ఎస్జీటీ, ఎల్పీ స్పౌజ్ బదిలీలను నిర్వహించాలని విజ్ఞప్తి చేసినా.. ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ఉపాధ్యాయులు అందరికీ బదిలీల్లో పాల్గొనే అవకాశమిచ్చి వెబ్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్, ఎస్సీఎస్టీ యూఎస్, టీఎస్‌పీటీఏ నాయకులు సత్యానంద్, రమేశ్, సత్యనారాయణ, రాజన్న, సుధాం, వెంకటరమణ పాల్గొన్నారు.

# అభివృద్ధే మా ధ్యేయం



పాతకలెక్టరేట్‌లో కళాభారతి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కేటీఆర్, పాల్గొన్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి

- సంక్షేమానికీ పెద్దపీట
- కళాభారతి కళాకారులు, కవులకు అపురూపమైన కానుక
- ఉద్యమంలో కేసీఆర్ వెంట ముందువరుసలో నడిచిన జిల్లా
- రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్
- కళాభారతి పనులకు శంకుస్థాపన
- ఆర్‌యూబీ ప్రారంభోత్సవం

సుభాష్‌నగర్: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. శనివారం నగరంలో కంఠేశ్వర్ కమాన్ వద్ద రూ. 22కోట్లతో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిని కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం పాత కలెక్టరేట్ వద్ద రూ. 50కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఇందూరు కళాభారతి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో జిల్లా ముందువరుసలో నిలుస్తూ యావత్ తెలంగాణకు మార్గదర్శకంగా నిలిచిందని గుర్తుచేశారు. కేసీఆర్ పిలుపునందుకుని ఉద్యమానికి శ్రీకారం చుట్టి ఆయన వెంట నడిచారన్నారు. అందుకే నిజామాబాద్ అంటే సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకమైన అభిమానమన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో మరింతగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, అధికారులతో సీఎం ఇటీవలే సమీక్షించారని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారన్నారు. ఇందులో భాగంగానే కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, బాలలు, అన్ని వర్గాల ప్రజలకు అపురూపమైన కానుక అందించేలా ఇందూరు కళాభారతి నిర్మాణానికి రూ. 50కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. తెలంగాణలో ఎక్కడా లేనివిధంగా అన్ని హంగులు, అధునాతన వసతులతో అలరారేలా కళాభారతి నమూనా రూపొందించారని పేర్కొన్నారు. ఎనిమిదన్నరేళ్లలో నిజామాబాద్ నగర అభివృద్ధికే ప్రభుత్వం రూ. 936 కోట్లు ఖర్చు చేసిందని, ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు అనేకం ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. మరో నెలన్నర రోజుల్లో పూర్తి కానున్న ఐటీ హబ్‌ను ప్రారంభించేందుకు తాను మళ్లీ పర్యటిస్తానని తెలిపారు.



మట్లాడుతున్న మంత్రి కేటీఆర్

### మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం

అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కోసం శనివారం నగరానికి విచ్చేసిన కె తారకరామారావుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. హెలీకాప్టర్‌లో నూతన కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. రాష్ట్ర రోడ్లు–భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్, బోధన్ నియోజకవర్గాల శాసనసభ్యులు జీవన్‌రెడ్డి, షకీల్ ఆమేర్, కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ మంత్రి కేటీఆర్‌తో కలిసి హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో వచ్చారు. హెలీప్యాడ్ వద్ద రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, ఎమ్మెల్సీలు రాజేశ్వర్ రావు, వి గంగాధర్ గౌడ్, రాష్ట్ర మహిళా సహకార సంస్థ చైర్ పర్సన్ ఆకుల లలిత, మేయర్ దండు నీతూకిరణ్, కలెక్టర్ నారాయణరెడ్డి, పోలీస్ కమిషనర్ కేఆర్ నాగరాజు, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ మోహన్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, పార్టీ ప్రతినిధులు తారిక్ అన్సారీ, ఈగ గంగారెడ్డి, తదితరులు కేటీఆర్‌కు పూల మొక్కలు, బొకేలు అందించి ఘన స్వాగతం పలికారు. కట్టుదిట్టమైన పోలీసు భద్రత మధ్య మంత్రి కేటీఆర్ పర్యటన కొనసాగింది.

## శాస్త్రీయత, సాంకేతికతతో అద్భుత ఫలితాలు

- రాష్ట్రంలో 16 ప్రాంతాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు
- రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్
- కాకతీయ సాండ్ బాక్స్ ఆధ్వర్యంలో రైతులతో ముఖాముఖి

సుభాష్‌నగర్: వ్యవసాయానికి శాస్త్రీయత, సాంకేతికత జోడిస్తే అద్భుత ఫలితాలు సాధించవచ్చని మంత్రి కేటీఆర్ అన్నారు. నగరశివారులోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో కాకతీయ సాండ్ బాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టెక్నాలజీ ఫర్ ఇంపాక్ట్ అండ్ స్కేల్, డెవలప్‌మెంట్ డైలాగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏ స్టెప్ టు వర్డ్స్ రూరల్ ట్రాన్స్‌ఫార్మేషన్ పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులతో కేటీఆర్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 66 లక్షల మంది రైతులకు 8 దఫాలుగా రూ. 65వేల కోట్లను రైతుబంధు పథకం కింద పెట్టుబడిని అందజేశామన్నారు. 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. 5వేల ఎకరాలను ఒక క్లస్టర్‌గా విభజించి, వ్యవసాయ విస్తీర్ణాధికారిని నియమించి, సాగులో మెళకువలు, సాంకేతికతపై శాస్త్రవేత్తలతో చర్చించేందుకు 2603 రైతువేదికలను నిర్మించామని గుర్తుచేశారు. ముస్సోరీలో యువ ఐఏఎస్‌లకు శిక్షణనిచ్చే పుస్తకాల్లో పాఠ్యాంశంగా మార్చడం తెలంగాణ సాధించిన ఘనత అని చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే అత్యంత పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాళేశ్వరంతో 45లక్షల ఎకరాలకు స్థిరీకరణ జరిగిందని, నాలుగేళ్లలో పూర్తి చేశామని వివరించారు. దీంతో హైదరాబాద్, నిజామాబాద్ వంటి నగరాలకు 2060 వరకు తాగునీరు అందించవచ్చాన్నారు.

**10 వేల ఎకరాల్లో..**

రాష్ట్రవ్యాప్తంగా 16 ప్రాంతాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వివరించారు. ఇందుకోసం 10వేల ఎకరాలు గుర్తించనున్నారని, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు స్టార్టప్ కంపెనీల సీఈవోలు, ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు మంత్రి కేటీఆర్ సమాధానమిచ్చారు.

### వ్యవసాయ ఉత్పత్తుల్లో మూడో స్థానం

వ్యవసాయ ఉత్పత్తుల్లో రాష్ట్రం 26వ స్థానం నుంచి 3వ స్థానానికి ఎగబాకిందని మంత్రి కేటీఆర్ వివరించారు. నీలి విప్లవంతో మత్స్యసంపదలో తెలంగాణ స్వయం సమృద్ధిని సాధించిందన్నారు. సిరిసిల్ల జిల్లా రాజరాజేశ్వరసాగర్ వద్ద రూ. వెయ్యి కోట్లతో తిలాఫియా చేపను కేజ్‌కల్చర్ ద్వారా పెంచి అమెరికాకు ఎగుమతి చేస్తున్నారని ఉదహరించారు. గులాబీ విప్లవం గొర్రెల పెంపకం, పశుసంపద, మాంసం ఉత్పత్తి పెరిగిందని, అందులో అవకాశాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. శ్వేత విప్లవంతో విజయడెయిరీ లాభాల్లోకి వచ్చిందని, ఆ డెయిరీలో పాలు పోసిన వారికి రూ. 4 ప్రోత్సాహకాన్ని అందిస్తున్నామని వివరించారు. దళితబంధు లబ్ధిదారులు మినీ డెయిరీలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. పసుపు విప్లవంతో ఆయిల్‌పామ్ పంటను ప్రోత్సహిస్తున్నామని, ఐదేళ్లలో 20లక్షల ఎకరాల సాగు లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. తెలంగాణలో రానున్న రోజుల్లో 5 రకాల విప్లవాలు సాక్షాత్కారం కానున్నాయని అభిప్రాయపడ్డారు.



కాకతీయ సాండ్‌బాక్స్ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

# అమ్మను చూడాలని..

- హాస్టల్ నుంచి బయటకు వచ్చిన హర్షిత



తిరిగి పాఠశాలలో చేరిన బాలిక

మాక్లూర్: అమ్మను చూడాలనే హర్షిత హాస్టల్ నుంచి బయటకు వెళ్లిందని దుర్గానగర్ గిరిజన సంక్షేమ బాలికల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ శనివారం వెల్లడించారు. శుక్రవారం రాత్రి ఎస్టీ మినీ గురుకులం నుంచి రెండో తరగతి చదువుతున్న హర్షిత అనే బాలిక హాస్టల్ నుంచి బయటకు వెళ్లి ఆంధ్రనగర్ శివారులో రోడ్డుపై విలపిస్తూ కన్పించడంతో నందిపేట పీఎస్‌లో విధులు నిర్వహించే కానిస్టేబుల్ ముత్యం గమనించి మాక్లూర్ పోలీస్ స్టేషన్లో అప్పగించిన విషయం తెలిసిందే. హర్షిత దుర్గానగర్ మీది తండాకు చెందిన బాలిక కాగా తల్లిదండ్రులు కుటుంబ తగాదాల వల్ల వేర్వేరుగా ఉంటున్నారు. ప్రస్తుతం కుల పెద్దల నిర్ణయం మేరకు హర్షిత తండ్రి వద్ద ఉంటూ వారి ఇష్టానుసారం హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. అమ్మను చూడాలన్నా కోరికతో శుక్రవారం మధ్యాహ్నమే ఒకసారి బయటకు వెళ్లిన హర్షిత నానమ్మ కంటపడింది. ఆమె వెంటనే తిరిగి బలవంతంగా పాఠశాలలో అప్పగించి వెళ్లింది. ఆ తర్వాత అమ్మ దగ్గరికి ఎలాగైనా వెళ్లాలని రాత్రి మరోసారి బాలిక హాస్టల్ వెనుక నుంచి బయటకు వెళ్లిందని, ఈ విషయాన్ని పసిగట్టలేక పోయినట్లు ప్రధానోపాధ్యాయురాలు వివరించారు. శుక్రవారం రాత్రే బాలికను తల్లిదండ్రులకు అప్పగించినప్పటికీ వారు మళ్లీ పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు.

# మంత్రికి నిరసనల సెగ

- కాన్వాయ్‌ని అడ్డుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ నేతల యత్నం
- లాఠీ ఝుళిపించిన పోలీసులు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా ఆయన కాన్వాయ్‌ను బీజేపీ, కాంగ్రెస్ నేతలు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో ముందుస్తుగానే ప్రతిపక్ష, విద్యార్థి సంఘాల నేతలు, ప్రజాసంఘాల నేతలను అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు. కేటీఆర్ ఉదయం కలెక్టరేట్ వద్ద హెలీకాప్టర్‌లో దిగారు. అనంతరం కాన్వాయ్ ద్వారా బోర్గాం (పి)లోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌కు వెళ్తుండగా కంఠేశ్వర్ బైపాస్ ఎక్స్ రోడ్డు వద్ద కాంగ్రెస్ కార్పొరేటర్ గడుగు రోహిత్‌తో పాటు యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పవన్ జాదవ్, నవాజ్, మీరన్, ఆసిఫ్‌లు నల్లజెండాలతో కాన్వాయ్‌కు అడ్డుగా వచ్చారు. వీరిని పోలీసులు వెంటనే జీపులో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అలాగే పాత కలెక్టర్‌లో ఇందూర్ కళాభారతి భూమిపూజ కార్యక్రమం అనంతరం ఓ ప్రవేటు కార్యక్రమంలో పాల్గొని నగరంలోని ఎల్లమ్మగుట్టలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయానికి వెళ్తున్న సమయంలో బీజేపీ కార్పొరేటర్ సుధీర్‌తో పాటు ఇద్దరు కార్యకర్తలు బీజేపీ జెండాలు పట్టుకొని మంత్రి కేటీఆర్ కాన్వాయ్ దగ్గర వరకు వెళ్లారు. దీంతో పోలీసులు బీజేపీ కార్యకర్తలను అడ్డుకొని పక్కకు తీసుకువచ్చారు. ఏసీపీలు ప్రభాకర్, కిరణ్‌కుమార్‌లు బీజేపీ కార్యకర్తలపై లాఠీచార్జ్ చేశారు. కారులో డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంతేకాకుండా పులాంగ్ వైపు నుంచి వెళ్తున్న బీజేపీ నేత ధన్‌పాల్ సూర్యనారాయణ కారును ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో అడ్డుకొని వేరే వైపు తరలించారు.



నగరంలోని ఎల్లమ్మగుట్ట వద్ద బీజేపీ నాయకులను పక్కకు తోసివేస్తున్న పోలీసులు

### భారీగా పోలీసుల బందోబస్తు

నగరంలో మంత్రి కేటీఆర్ పర్యటనకు పోలీసుల భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో కేటీఆర్ పర్యటన జరిగే ప్రాంతాల్లో పోలీసులను మోహరించారు. అనుమానితులను పోలీసులు సోదాలు నిర్వహించారు. మంత్రి కేటీఆర్ పర్యటించే ప్రాంతంలో పోలీసు జాగిలాలతోపాటు మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేశారు. సీపీ కేఆర్ నాగరాజు పర్యవేక్షణలో నలుగురు డీసీపీలు, ఎనిమిది ఏసీపీలు, 70 మంది సీఐలు, 80 ఎస్సైలు, 700 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

### ముందస్తు అరెస్టులు

జిల్లా కేంద్రంలో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్, ఏబీవీపీ, పీడీఎస్‌యూ, పీవైఎల్, ఐఎఫ్‌టీయూ, సీపీఐఎంఎల్ ప్రజాపంథాతో పాటు వివిధ ప్రజా సంఘాల నేతలను ముందుస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా, విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి.

# బదిలీల బాగోతం..!

- అనుకూలమైన ప్రాంతాల కోసం పైరవీలు
- కాసులు కురిపించిన స్పౌజ్ కేసులు !
- కొందరికి కావాల్సిన స్థానాలు కేటాయింపు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ విమర్శలకు తావునిస్తోంది. స్పౌజ్ బదిలీల వారికి పాఠశాలల కేటాయింపు విషయంలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండు రోజుల్లో 58 మంది టీచర్లకు స్పౌజ్ బదిలీలు జరిగాయి. ఇందులో ప్రాంతాల కేటాయింపులో ముడుపుల బాగోతం కొనసాగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**అనుకూలమైన ప్రాంతాల కోసం ముడుపులు?**

స్పౌజ్ బదిలీల్లో భాగంగా కొందరు టీచర్లు హెచ్ఆర్ఏ ప్రాంతాలపై దృష్టి పెట్టారు. భార్య లేదా భర్త ఉన్న ప్రాంతాన్ని కాదని నగరానికి దగ్గరగా ఉన్న హెచ్ఆర్ఏ ప్రాంతాలను దక్కించుకున్నట్లు సమాచారం. జిల్లాలో మొదటి రోజు 46 మందికి బదిలీ ప్రక్రియ నిర్వహించారు. ఇందులో సుమారు 18 నుంచి 20 మంది వరకు నిబంధనలకు అనుగుణంగా కాకుండా వారికి అనుకూలమైన ప్రాంతాలను ఎంపిక చేసుకున్నారు. వాస్తవానికి స్పౌజ్ బదిలీపై వచ్చిన వారిని భార్యా, భర్త ఎవరైతే ఉన్నారో అదే ప్రాంతానికి వారిని కేటాయించాలి. అక్కడ ఖాళీ లేకపోతే సమీప ప్రాంతంలో ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ కేటాయించాలి. కానీ కొందరికి మాత్రమే ఈ నిబంధన అమలు చేశారు. కొందరు ఉపాధ్యాయ సంఘాల ద్వారా విద్యాశాఖ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి తమకు నచ్చిన స్థానాలను దక్కించుకున్నారు. మొదటి రోజు వారు ఎంపిక చేసుకున్న ప్రాంతాలను కాదని రెండోరోజు శనివారం జిల్లా విద్యాశాఖకు వచ్చి మళ్లీ మార్పులు చేర్పులు చేయించుకున్నారు. ఓ ఉపాధ్యాయ సంఘం నాయకులు తమకు అనుకూలమైన ఏడుగురిని జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్న హెచ్ఆర్ఏ ప్రాంతంలో పోస్టింగ్ ఇప్పించుకున్నారు. వారితో పాటు మరో పది మంది వరకు డబ్బులు చెల్లించి హెచ్ఆర్ఏ ఉన్న ప్రాంతాల్లో కేటాయింపులు పొందినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తం 18 నుంచి 20 మందికి నిబంధనలకు విరుద్ధంగా స్థానాల కేటాయింపు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఇందులో ఒక సంఘం నాయకులు సమన్వయకర్తలుగా డబ్బులు ఇప్పించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అలాగే విద్యాశాఖలో పనిచేసే ఓ ఉద్యోగి తమ పోలీసు బంధుత్వంతో విద్యాశాఖ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి మూడు ప్రాంతాలను మార్పులు చేయించుకున్నట్లు తెలిసింది. మొదటి రోజు బదిలీ జరిగిన వారిని మళ్లీ ఆఫీసుకు పిలిపించి సర్వీసు రికార్డులు పరిశీలించాలనే పేరుతో మరోసారి కౌన్సెలింగ్ మాదిరిగా నిర్వహించి మార్పులు చేర్పులు చేశారు. ఈ తతంగంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు.



### 58 మందికి బదిలీ

విద్యాశాఖ అధికారులు జిల్లాలో రెండు రోజులుగా 58 మందికి స్పౌజ్ బదిలీలు చేశారు. మొదటి రోజు 46 మంది టీచర్లకు, రెండో రోజు రోజు 12 మందికి స్థానచలనం కల్పించారు. దీంతో స్పౌజ్ బదిలీల ప్రక్రియ ముగిసింది. రెండో రోజు ఇతర శాఖలకు చెందిన వారికి సైతం బదిలీలు పూర్తి చేశారు.

### ఎలాంటి అక్రమాలు జరగలేదు

స్పౌజ్ బదిలీలు నిబంధనల ప్రకారమే జరిగాయి. 58 మందికి ట్రాన్స్‌ఫర్ చేశాం. వారికి స్పౌజ్ ప్రాంతంలోనే కేటాయించడం జరిగింది. అక్కడ ఖాళీ లేకపోతే సమిపంలో పోస్టింగ్ ఇవ్వడం జరిగింది. అక్రమాలు జరిగాయనే ఆరోపణల్లో నిజం లేదు.

–దుర్గాప్రసాద్, డీఈవో

### రమణీయం.. రథోత్సవం..



నగరంలోని కంఠేశ్వర్ ఆలయం వద్ద రథోత్సవంలో భారీగా పాల్గొన్న భక్తులు

- వివరాలు 10లో..

## క్లుప్తంగా

### రాజేశ్వరికి సేవారత్న పురస్కారం


రాజేశ్వరి

నిజామాబాద్‌నాగారం: గౌతమి మహిళా విని యోగదారుల సంఘం అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి మహిళా సేవా రత్న పురస్కారానికి ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు ఆంధ్ర కేసరి జూనియర్ కళాశాలలో ఆదివారం ఆమె ఈ పురస్కారం అందుకోనున్నారు.

### సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఎల్లారెడ్డి: ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. శనివారం గండిమాసానిపేట గ్రామంలో కమ్యూనిటీ ప్రోగ్రాంను నిర్వహించి సరైన ధృవపత్రాల్లేని వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ చిన్న పిల్లలకు వాహనాలను ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సైలు గణేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

### 'హిందీ'లో అశోక్‌చౌహాన్‌కు పీహెచ్‌డీ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ హిందీ విభాగంలో పరిశోధక విద్యార్థి అశోక్‌చౌహాన్ పీహెచ్‌డీ సాధించారు. తెయూ అసోసియేట్ ప్రొఫెసర్ ప్రవీణాబాయి పర్యవేక్షణలో 'హిందీ కే ఆదివాసీ ఉపన్యాసోమే చిత్రిత్ జీవన్ సంఘర్ష్' అనే అంశంపై అశోక్‌చౌహాన్ పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. శనివారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఓపెన్ వైవావోస్‌కు శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ నారాయణ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. తెయూ ఆర్ట్స్ డీన్ కనకయ్య, బీవోఎస్ చైర్మన్ ఎండీ జమీల్‌అహ్మద్, హెచ్‌వోడీ పార్వతి పాల్గొన్నారు. అశోక్‌చౌహాన్‌ను వీసీ రవీందర్ సన్మానించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని, ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి పాల్గొన్నారు.

### ప్రధాన మంత్రి పరీక్షపే చర్చ



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పరీక్ష పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎం కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం ఈ నెల 22న జరిగిన చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్, కంచెట్టి గంగాధర్, జిల్లా కార్యదర్శి సురేందర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గులాబీ శ్రేణుల్లో జోష్


బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, పాల్గొన్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి, ఎంపీ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

నిజామాబాద్ నగరంలో మంత్రి కేటీఆర్ పర్యటన గులాబీ శ్రేణుల్లో జోష్ నింపింది. నగరంలోని పలు అభివృద్ధి పనులను శనివారం ఆయన ప్రారంభించారు. నగర శివారులోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో కాకతీయ సాండ్ బాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టెక్నాలజీ ఫర్ ఇంపాక్ట్ అండ్ స్కేల్, డెవలప్‌మెంట్ డైలాగ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


మంత్రి కేటీఆర్ కాన్వాయ్


నగరంలోని ఆర్‌యూబీ వద్ద శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్


కాకతీయ సాండ్ బాక్స్ సమావేశంలో పాల్గొన్న కంపెనీల సీఈవోలు, ప్రతినిధులు


మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకుంటున్న కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

# పసుపు రైతులతో రాజకీయాలు సరికావు

- పసుపు బోర్డు ఏర్పాటు చేయాలి
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్


ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ఆర్మూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పసుపు రైతులతో రాజకీయం చేయడం సరైనది కాదని, పసుపు రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పెర్కిట్‌లోని ఎమ్మార్ గార్డెన్స్‌లో శనివారం పసుపు రైతుల గోస అనే అంశంపై సదస్సు నిర్వహించారు. రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రాష్ట్రంలో పసుపు ధరకు గిట్టుబాటు ధర లభించకపోగా పక్కనే ఉన్న మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌లో పసుపు పంటకు మన కన్నా ఎక్కువ ధర పలుకుతోందన్నారు. పసుపు రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం పసుపునకు ప్రత్యేకంగా బోర్డును ఏర్పాటు చేయాలని, నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరవాలని డిమాండ్ చేశారు. రైతంగాన్ని చైతన్యం పరిచేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలని నాయకులకు సూచించారు. అనంతరం పలు అంశాలపై తీర్మానాలు చేశారు. జాతీయ కిసాన్ కాంగ్రెస్ వైస్‌చైర్మన్ కోదండ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్‌హందాన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు నీరడి భాగ్య, సత్యంరెడ్డి, ముప్ప గంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ఏజెంట్ రాములుకు ఘనంగా వీడ్కోలు


రాములును సన్మానిస్తున్న సాక్షి సిబ్బంది

నిజామాబాద్‌నాగారం: వివిధ పత్రికలకు గత 40 ఏళ్లుగా ఏజెంట్‌గా పనిచేసిన రాములు శనివారం రిటైర్మెంట్ తీసుకున్నారు. ఆయన సాక్షి సంస్థ ప్రారంభం నుంచి ఏజెంట్‌గా కొనసాగారు. నిబద్ధతో, వృత్తే దైవంగా భావించి పాఠకులకు పత్రికలను చేరవేసి మన్ననలు పొందారు. ఆరోగ్యం సహకరించకపోవడంతో వీడ్కోలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. తన సేవలను గుర్తించిన సాక్షి సంస్థకు, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సుభాష్‌నగర్‌లో రాములుకు సాక్షి సంస్థ ఆధ్వర్యంలో వీడ్కోల కార్యక్రమాన్ని నిర్వహించారు. సాక్షి బ్యూరో ఇన్‌చార్జి తమ్మాటి భద్రారెడ్డి పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్క్యూలేషన్ మేనేజర్ మల్లికార్జున్‌యాదవ్, ఏసీవో మధు, ఎస్ రాంనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## నిధుల దుర్వినియోగంపై విచారణ



లింగంపేట: మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీలకు సంబంధించి రూ. 2.96 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులను కంప్యూటర్ ఆపరేటర్ స్వాహా చేసిన విషయమై డీఎల్‌పీవో సురేందర్ శనివారం విచారణ చేపట్టారు. డిజిటల్ కీ ఆధారంగా నిధులను కంప్యూటర్ ఆపరేట్ తన ఖాతాలోకి మళ్లించుకున్నట్లు విచారణలో తేలింది. ఆపరేటర్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆయన వెంట ఎంపీవో ప్రభాకరచారి, పలు గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

# ఉత్సాహంగా ఎస్‌పీఎల్



SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

SPL
SAKSHI PREMIER LEAGUE

SUDHAKAR
PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY
Regional sponsor

నిజామాబాద్‌నాగారం: నగరంలోని పాలిటెక్నిక్ కాలేజీ మైదానంలో సాక్షి ప్రీమియర్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. శనివారం వివిధ జట్ల మధ్య రసవత్తరంగా మ్యాచ్‌లు జరిగాయి. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ పల్లె మహేష్, కోచ్ పారస్, అంపైర్లు షారుఖ్, దుర్గాప్రసాద్, స్కోరర్ నయీమ్, గ్రౌండ్స్‌మన్ కె నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**సునాయసంగా గెలుపు**

మొదటి మ్యాచ్‌లో క్షత్రియ కాలేజీ, నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు తలపడ్డాయి. మొదట క్షత్రియ జట్టు 10ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 31 పరుగులు చేసింది. పాలిటెక్నిక్ కళాశాల జట్టు ఒక్క వికెట్ కోల్పోకుండా 4 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది.

**ఉత్కంఠ పోరులో గెలిచిన 'నిశిత' జట్టు**

రెండో మ్యాచ్ నిశిత కాలేజీ, ఆర్మూర్ సిద్దార్థ కాలేజీల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన నిశిత జట్టు 10ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 77 పరుగులు చేసింది. ఇందులో చరణ్ 41 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. అనంతరం సిద్దార్థ జట్టు నిర్ణీత ఓవర్లలో 75 పరుగులు మాత్రమే చేసింది. ఇందులో కళ్యాణ్ 30 పరుగులతో పాటు 3వికెట్లు తీసిన ఫలితం లేకుండా పోయింది.

**6 వికెట్ల తేడాతో గెలిచిన ఎస్ఆర్ జూనియర్ కాలేజీ**

ఎస్ఆర్ జూనియర్ కాలేజీ, ఏహెచ్‌ఎంవీ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో ఎస్ఆర్ జట్టు గెలుపొందింది. మొదట ఏహెచ్‌ఎంవీ జట్టు 56 పరుగులు చేసింది. అనంతరం ఎస్ఆర్ కాలేజీ 8.2ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

**బౌలింగ్‌లో రాణించిన ధన్‌రాజ్**

నాలుగో మ్యాచ్‌లో క్షత్రియ జట్టు, కోటగిరి పాలిటెక్నిక్ కాలేజీలు తలపడ్డాయి. మొదట క్షత్రియ జట్టు 5 వికెట్ల నష్టానికి 74 పరుగులు చేయగా కోటగిరి జట్టు 10ఓవర్లలో 56 పరుగులే చేసింది. క్షత్రియ జట్టులో ధన్‌రాజ్ 4వికెట్లు తీసి రాణించాడు.

**'ఎస్ఆర్‌కే' విజయం**

ఐదో మ్యాచ్ ఎస్ఎస్ఆర్, ఎస్ఆర్‌కే కామారెడ్డి మధ్య జరిగింది. 10 ఓవర్లలో ఎస్ఆర్‌కే జట్టు 3వికెట్ల నష్టానికి 73 పరుగులు చేయగా ఎస్ఎస్ఆర్ 53 పరుగులు మాత్రమే చేసింది.


విజయం సాధించిన క్షత్రియ కాలేజీ జట్టు

**అందరి సహకారంతో..**



వరుసగా రెండు ఓవర్లలో రెండేసి వికెట్లు తీసి, ప్రత్యర్థి జట్టు ప్రధాన బ్యాట్స్‌మెన్‌ను ఔట్ చేశాను. నాతోటీ క్రీడాకారుల సహకారంతోనే నాలుగు వికెట్లు తీసి మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోషించగలిగాను.

– ధన్‌రాజ్, క్షత్రియ జట్టు

## నమో నారసింహ..

- నేటి నుంచి జాన్కంపేట్ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు
- భారీగా రానున్న భక్తులు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ


లక్ష్మీనరసింహస్వామి విగ్రహం

ఎడపల్లి: మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. నిజామాబాద్‌కు 12 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంటుంది. ఫిబ్రవరి 6వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. జాతరకు మహారాష్ట్ర, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు చెందిన భక్తులు హాజరవుతారు. భక్తులకు ఇబ్బందులు కల్గకుండా ఏర్పాట్లు చేశారు.

**కార్యక్రమాలు ఇలా..**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నుంచి ఈ నెల 31 వరకు అధ్యయన ఉత్సవం, ద్రావిడ ప్రబంధ పారాయణము, ఫిబ్రవరి 1న స్థాపనము, పుణ్యవాచనం, మాతృకపూజ, రక్షాబంధనం, అంకురార్పణ, 2న శాల ప్రతిష్ఠ, వాస్తు హోమం, ధ్వజారోహణం, యజ్ఞం, బలిహరణం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 3న లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవం, అన్నదానం ఉంటాయి. 5న రథోత్సవం యజ్ఞం, భజన పోటీలు, 6న చక్రతీర్థం, జాతర, కుస్తీ పోటీలు నిర్వహించనున్నారు.

**అష్టముఖి కోనేరు విశిష్టత**

దక్షిణ భారతదేశంలోనే అష్టముఖి కోనేరు స్వామివారి ఆలయం వద్ద ఉంటుంది. ఈ కోనేటిలో స్నానమచరించి, స్వామివారిని దర్శించుకుంటే గ్రహబాధలు తొలగి పోతాయని నమ్మకం. పూర్వం రుషులు తపస్సు చేస్తున్న సమయంలో కళిపురుషుడి ప్రభావంతో ఎన్నో విధాలైన ఆటంకాలు ఎదురయ్యాయి. దాంతో రుషులు బ్రహ్మదేవుణి వేడుకొంటే, ఆయన ఆజ్ఞ మేరకు దిక్పాలకులు ఎనిమిది దిక్కుల్లో కాపలా ఉండగా మధ్యలో నీరు ఉద్భవించి ఈ కోనేరు ఏర్పడిందని ఇక్కడి వారు చెబుతారు. భక్తులు వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అష్టముఖి కోనేరులో స్నానాలు ఆచరిస్తుంటారు. ఇక్కడ స్వామివారు శాంతమూర్తిగా దర్శనమిస్తారు.


లక్ష్మీనరసింహస్వామి ఆలయం


అష్టముఖి కోనేరు



**క్రైం కార్నర్**

# ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు


మృతి చెందిన నగేష్

ఇందల్వాయి: ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఫకీర్ కొండాపూర్ గ్రామానికి చెందిన అందె నగేష్(35) మృతి చెందాడు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాలు.. నగేష్ బావమరిది నవీన్ దుబాయ్ వెళ్లాల్సి ఉండగా నవీన్‌తో పాటు జగ్గసాగర్‌కి చెందిన అతని స్నేహితుడు వెంకటేశ్‌గౌడ్‌ని వెంటపెట్టుకొని నగేష్ శుక్రవారం ఎయిర్‌పోర్టుకు కారులో బయలు దేరాడు. నవీన్‌ను ఏయిర్‌పోర్టులో దింపి, తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు టోల్‌ప్లాజా దాటగానే నిలిపి ఉంచిన లారీని ఢీకొంది. ప్రమాదంలో నగేష్ తలకు తీవ్రగాయాలు కాగా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కారు నడుపుతున్న వెంకటేష్‌గౌడ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఠాణా ఎదుట ఒకరి ఆత్మహత్యాయత్నం

వర్ని: ఆస్తిలో వాటా ఇవ్వమని అడిగితే మామ నిరాకరించడంతో అల్లుడు ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన వర్ని పోలీస్ స్టేషన్ వద్ద శనివారం చోటు చేసుకుంది. వివరాలు.. వర్ని మండలం శ్యామ్‌రావు తండాకు చెందిన సావన్ గౌరీ(25), మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ముక్రమాబాద్‌కు చెందిన చంద్రకాంత్(30) ఐదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అప్పటి నుంచి వేరే ప్రాంతంలో కాపురం పెట్టారు. శనివారం ఉదయం దంపతులు ఇద్దరు శ్యామ్‌రావు తండాలోని గౌరీ తండ్రి ఉత్తమ్ ఇంటికి వచ్చారు. ఇప్పటి నుంచి తాము ఇక్కడే ఉంటామని ఆస్తిలో కొంత భాగం ఇవ్వాలని కోరారు. దానిని గౌరీ తండ్రి ఉత్తమ్ నిరాకరించడంతో భార్యాభర్తలు వర్ని పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై అనిల్‌రెడ్డి ప్రేమ జంట, వారి బంధువులకు మధ్య సయోధ్య కుదిర్చేందుకు యత్నిస్తుండగా చంద్రకాంత్ తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. ఎస్సై అనిల్‌రెడ్డి బాధితుడిని పోలీస్ వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుని ఆరోగ్యం మెరుగ్గా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. తమని ఇంట్లోకి రానివ్వకుండా తిట్టి పంపడంతోనే ఆత్మహత్యకు యత్నించినట్లు బాధితుడు 'సాక్షి'తో చెప్పారు. వర్ని పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్ గ్రామానికి చెందిన బట్టులీల(45) శనివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఆమె జీవితంపై విరక్తి చెంది ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన పేర్కొన్నారు. మృతురాలి భర్త శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

## విద్యుత్ షాక్‌తో గేదె మృతి

లింగంపేట: మండలంలోని మాలోత్‌తండాలో ధారావత్ రాములుకు చెందిన గేదె శనివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ శివారులోని పంట చేను వద్ద మేతకు వెళ్లిన గేదె తెగిపడిన ట్రాన్స్‌ఫార్మర్ సర్వీసు తీగను తాకడంతో విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది.

## చెరువులో మునిగి ఒకరి మృతి

కోటగిరి: చేపల వేటకు వెళ్లి చెరువులో మునిగి ఒకరు మృతి చెందిన సంఘటన కోటగిరిలోని పోచారం కాలనీలో చోటు చేసుకుంది. వివరాలు.. కాలనీకి చెందిన ముఖేడ్ రాములు (42) కూలీ పనులు చేసుకొని జీవిస్తాడు. అప్పుడప్పుడు ఇంట్లో వండటానికి చేపల వేటకు వెళ్తాడు. ఈ క్రమంలో ఈ నెల 25 రాత్రి దామర చెరువులో చేపల వల వేయడానికి వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఉదయం ఆయన మృతదేహం చెరువులో తేలింది. చెరువులోని గుంతలో పడి ఆయన మృతి చెందాడు. మృతుడి భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు.

## రెండు బైక్‌లు ఢీ: ఒకరికి తీవ్ర గాయాలు


గాయపడ్డ బాబు

పిట్లం: మండల కేంద్రంలోని పిట్లం-తిమ్మనగర్ రహదారిపై శనివారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. పిట్లం గ్రామానికి చెందిన బాబు పిట్లం నుంచి తిమ్మనగర్ వైపు వెళ్తూ ముందు వెళ్తున్న మరో బైక్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో బాబుకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## ప్రాణం తీసిన డబ్బుల గొడవ

- మామ తిట్టాడని ఆత్మహత్య చేసుకున్న అల్లుడు


సందీప్(ఫైల్)

నవీపేట: మామ, అల్లుళ్ల మధ్య నెలకొన్న డబ్బుల గొడవ ఒకరి మృతికి కారణమైంది. తన మామ తిట్టాడని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. హైదరాబాద్‌లోని ఉప్పుగూడకు చెందిన అర్థం వెంకట సుబ్బలక్ష్మి, అర్థం మనోహర్ దంపతుల చిన్న కుమారుడు సందీప్(30)కు నిజామాబాద్‌కు చెందిన కొండ నాగేందర్ కూతురు ప్రియతో 2020లో వివాహమైంది. వీరికి రెండేళ్ల బాబు ఉన్నాడు. సందీప్ మరదలు ప్రీతి వివాహం ఈ నెల 26న నిజామాబాద్‌లో జరిగింది. వీరి వివాహానికి సందీప్ భార్య, తల్లిదండ్రులతో కలిసి వచ్చాడు. ఈనెల 27న సాయంత్రం సందీప్‌కు అతని మామ నాగేందర్ మధ్య డబ్బుల విషయమై గొడవ జరిగింది. ఈ క్రమంలో నాగేందర్ సందీప్‌ను తిట్టాడు. తనను తీవ్ర పదజాలంతో దూషించాడని మనస్తాపం చెందిన సందీప్ ద్విచక్ర వాహనంపై యంచ శివారులోని గోదావరి బ్రిడ్జి వద్దకు వెళ్లి తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులకు తాను చనిపోతున్నట్లు వాట్సాప్‌లో వాయిస్ మెసెజ్ చేశాడు. అల్లుడినని చూడకుండా తనను తిట్టిన మామపై చర్యలు తీసుకోవాలని మెసెజ్ పెట్టి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టంకు పంపారు. ఆత్మహత్యకు కారణమైన కొండ నాగేందర్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## గంజాయి ముఠా అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి

బాల్కొండ: బాల్కొండ శివారులోని నాగుల కుంట చెరువు వద్ద గంజాయి తాగుతూ, విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసి ఒక బైక్, 200 గ్రాముల గంజాయి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన గడ్డం నరేశ్, బాల్కొండకు చెందిన ఎర్రం అఖిల్, పెర్కిట్‌కు చెందిన ఆలాకుంట నాగారాజు నాగుల కుంట చెరువులో నిత్యం గంజాయి తాగుతూ, ఇతరులకు విక్రయిస్తున్నారన్నారు. నిజామబాద్ రైల్వేస్టేషన్ వద్ద, ఆదిలాబ్ జిల్లా బోర్గాం, నేరేడిగొండ, తదితర గ్రామాల నుంచి గుర్తు తెలియని వ్యక్తుల వద్ద తక్కువ ధరకు గంజాయి పొట్లలను కొనుగోలు చేసి విక్రయిస్తున్నారన్నారు. వారిని బాల్కొండ ఎస్సై ఎస్సై గోపి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.